సాక్షి
కర్నూలు
శనివారం : 11 : అక్టోబర్ : 2025



శాస్త్రోక్తంగా ఊయలసేవ
శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబాదేవికి శుక్రవారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి సహస్రనామ పూజలు చేశారు.



ఆదాయం వద్దు.. ప్రయివేట్ ..
పర్యాటక అభివృద్ధి సంస్థ యూనిట్లను కూటమి ప్రభుత్వం ప్రయివేట్‌కు అప్పగించేందుకు అడుగులు వేస్తోంది. దీంతో టూరిజం ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. 8లో▸



భావోద్వేగాలు నియంత్రణలో..
ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోగలిగితే మానసికంగా దృఢంగా ఉంటారని న్యాయసేవాసదన్ సివిల్‌జడ్జి బి. లీలా వెంకటశేషాద్రి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

ఇంటర్ ఫీజు చెల్లింపు గడువు పెంపు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్–2025 పరీక్షల ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 22వ తేది వరకు పొడిగిస్తూ ఇంటర్మీయెట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో చ దువుతున్న విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించాలని, రూ.1000 ఆలస్య రుసుముతో ఈ నెల 30వ తేది వరకు చెల్లించ వచ్చు. ఇదే చివరి అవకాశమని, మరోసారి గడువు పొడిగింపు ఉండదని బోర్డు అధికారులు స్పష్టం చేశారు.

డిప్లమా కోర్సులకు మొదటి విడత కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): అలైడ్ హెల్త్ సైన్సెస్(పారా మెడికల్)కు సంబంధించిన 10 డిప్లమా కోర్సుల కు మొదటి విడత కౌన్సెలింగ్ శుక్రవారం పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు.మెరిట్ కంరోస్టర్ ప్రకారం సీట్లు భర్తీ చేశామన్నారు. 18వ తేదీ న రెండోవిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పూ ర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్,పాథాలజి హెచ్‌ఓడీ డాక్టర్ బాలీశ్వరి,ఏడీ మ ల్లేశ్వరి,ఆఫీస్ సూపరింటెండెంట్ హరిశంకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్,హరిప్రసాద్ పాల్గొన్నారు.

8 మండలాల్లో ఒక మోస్తరు వర్షం



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 8 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. సి.బెళగల్‌లో 26.4 మి.మీ, క్రిష్ణగిరిలో 22.6, గూడూరులో 20.6, కోడుమూరులో 18.6, పత్తికొండలో 13, మద్దికెరలో 11, కోసిగిలో 4.6, ఆలూరులో 3.2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తంగా సగటున 4.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అక్టోబర్ నెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 12.8 మి.మీ వర్షం కురిసింది. కాగా ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించారు.

ఆర్‌యూ కాన్వొకేషన్‌కు నోటిఫికేషన్ విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవం(కాన్వొకేషన్)కు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు వెల్లడించారు. నవంబర్ 12న వర్సిటీలో కాన్వొకేషన్ నిర్వహిస్తామన్నారు. 2024–25 విద్యా సంవత్సరం వరకు యూజీ, పీజీ, బీఈడీ, బీపీఈడీ, ఎల్‌ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసుకొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కాన్వొకేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నా రు. 2023 సెంప్టెంబర్, 2024 మేలో జారీ చేసిన నోటిఫికేషన్లలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. https://od.rayalaseemauniversity.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

పిల్లలను వీడి అనంతలోకాలకు..

● ఉరుముల శబ్దానికి మహిళ మృతి



పిల్లలతో సుమతి (ఫైల్)

చాగలమర్రి: పిల్లలకు జ్వరం రావడంతో చికిత్స చేయించడానికి వచ్చిన ఇర్రిపోతుల సుమతి(30) ఉరుముల శబ్దానికి భయపడి మృతి చెందారు. ఈ దుర్ఘటన గొడిగనూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగింది. వైఎస్సార్ జిల్లా పెద్ద ముడియం మండలం ఎన్. కొట్టాల గ్రామానికి చెందిన సందీప్‌తో సుమతికి వివాహం అయ్యింది. ఏడాది వయసున్న ఇద్దరు పిల్లలు మోషేసస్, ఎరిల్లాలకు జ్వరం రావడంతో వారికి చికిత్సలు చేయించుకోవడానికి ఈమె గొడిగనూరుకు మూడు రోజుల క్రితం వచ్చారు. శుక్రవారం తెల్లవారు జామున ఇంటి సమీపంలో బహిర్భూమికి వెళ్లి ఉరుముల శబ్దానికి స్పృహ కోల్పోయారు. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే గుండె పోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య, ఎర్రబోతుల పాపిరెడ్డి, చల్లా మధుసూదన్ రెడ్డి, విరూపాక్షి, చెన్న కేశవరెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, శ్రీదేవి, బుట్టా రేణుక, సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మణిగాంధీ, రామచంద్రారెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు

స్పీకర్ గారూ.. ఇప్పుడేమంటారు!

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో వైద్య కళాశాల అనుమతికి నాటి ప్రభుత్వం జీవో జారీ చేయలేదని గౌరవప్రదమైన పదవిలో ఉన్న స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వెల్లడించడం బాధాకరం. గురువారం నర్సీపట్నంలో పర్యటించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీవో కాపీని స్పష్టంగా ప్రదర్శించడంతో స్పీకర్ నోరు మూగబోయింది.

– మాజీ మంత్రి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి

కోటి సంతకాలతో కుట్రలు తిప్పికొడదాం

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై పోరుబాటు

- జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పీపీపీ విధానాన్ని విరమించుకునే వరకు నిరసన ర్యాలీలు, ఆందోళనలు
- అమరావతిలో రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్న చంద్రబాబు
- రూ.5వేల కోట్లు ఖర్చు చేయలేకపోవడం దుర్మార్గం
- పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తలకే అత్యంత ప్రాధాన్యం
- కోటి సంతకాల సేకరణ పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు(టౌన్): 'మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజా వైద్యంతో మంచి పేరు వస్తుందనే చంద్రబాబు నాయుడు 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించేందుకు నిర్ణయించుకున్నారు. పీపీపీ విధానాన్ని విరమించుకునే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల మద్దతు అలుపెరుగని పోరాటం చేస్తుంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బిర్లా సర్కిల్ సమీపంలోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సంస్థాగత సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యం.. పేద, మధ్యతరగతి పిల్లలకు వైద్య విద్య అందకుండా చంద్రబాబు నాయుడు ఎన్నో కుట్రలు చేస్తున్నారన్నారు. ఏడాదిన్నర వ్యవధిలోనే రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వం రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు రూ.5 వేల కోట్లు దశల వారీగా మంజూరు చేయలేకపోతుందన్నారు. 17 వైద్య కళాశాలలు, వేలాది ఎకరాల భూములను తమ అనయాయులకు కట్టబెట్టేందుకే పీపీపీ విధానాన్ని తెరపైకి తెచ్చారన్నారు. అమరావతిలో రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్న చంద్రబాబు నాయుడు పేద పిల్లలకు ఉపయోగపడే ప్రభుత్వ వైద్య కళాశాలలను విస్మరించడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకొని పెద్ద ఎత్తున్న కోటి సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. పార్టీ పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కోటి సంతకాలు సేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటుకు అప్పగించే నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కమిటీలను, అనుబంధ కమిటీను నియమించుకొని జగనన్న పిలుపు మేరకు కార్యకర్తలను కలుపుకొని ఈ కార్యక్రమాన్ని నిర్విహిద్దామన్నారు. జీవోలు ఇవ్వకుండా ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేశారని చెప్పడం ఈ ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్రా భాస్కర్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామ కమిటీల నియామకానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీనియర్ మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రా రెడ్డి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళ, రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంగాల భరత్ కుమార్ రెడ్డి, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం రామక్రిష్ణ, మణిగాంధీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పురుషోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాంపుల్లయ్య యాదవ్, జగన్‌మోహన్ రెడ్డి, కర్రా హర్షావర్ధన్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, నగర అధ్యక్షులు అహమ్మద్ అలీఖాన్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, భారతి, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాటసాని రాంభూపాల్ రెడ్డి, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కార్యకర్తలే బలం. కూటమి ప్రభుత్వ కుట్రలను తిప్పికొడదాం. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. వచ్చే మూడేళ్లు ప్రజలకు, మహిళలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎండగడదాం. ప్రజలకు ఉచితంగా దక్కాల్సిన వైద్యాన్ని ప్రయివేటు పరం చేసి దోపిడీ చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీద్దాం. జిల్లాలో వైన్ షాపుల నిర్వహణ తిరనాళ్లను మరిపిస్తుంది. నంద్యాల చెక్‌పోస్టు, చెన్నమ్మ సర్కిల్ వద్ద విచ్చలవిడిగా రోడ్లమీదే మద్యం సేవిస్తున్నారు. మహిళలు బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. ఓట్ల కోసమే సూపర్ సిక్స్ హామీలని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది.

ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు

ప్రజా వైద్యాన్ని ప్రయివేటీకరించే విధానాలను ఈ ప్రభుత్వం విరమించుకోవాలి. ప్రజల ఆస్తి ప్రజలకే దక్కాలి. 26వ తేదీన జగనన్న నాయకత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ పార్లమెంటు ముఖ్యులు, జిల్లా ఇంచార్జీలు రాష్ట్ర గవర్నర్‌ను కలిసి కోటి సంతకాల సేకరణ ప్రతులను అందజేస్తాం. పేద ప్రజలకు దక్కాల్సిన ప్రభుత్వ వైద్యాన్ని ప్రయివేటీకరించడం దుర్మార్గం. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు చేస్తాం. అవసరమైతే ఢిల్లీ వీధుల్లో ఆందోళనలు చేపడతాం. లిక్కర్ స్కామ్‌లో ఆధారాలు ఉన్నా చర్యలు తీసుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. కల్తీ మద్యం కేసులో సూత్రధారులు ప్రభుత్వ పెద్దలే.



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి..

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమ అనుచరులకు కట్టబెట్టేందుకు పీపీపీ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను పూర్తి చేసేందుకు రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే పేదలకు నాణ్యమైన వైద్య విద్య, కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుంది. వేలాది ప్రజలకు ఉపయోగపడే వీటిని టీడీపీ అనుయాయులకు అప్పగిస్తే ఉద్యమిస్తాం. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో కోటి సంతకాల సేకరణను ఉద్యమ స్థాయిలో నిర్వహిస్తాం.



గ్రామ కమిటీల నియామకంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

చల్లా మధుసూదన్ రెడ్డి, జోన్ రాష్ట్ర కార్యదర్శి

పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేద్దాం. కోటి సంతకాల సేకరణ ప్రతిష్ఠాత్మకంగా చేపడదాం. జగనన్న పిలుపు మేరకు 42 రోజుల పాటు ప్రతి కార్యకర్త పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించాలన్న చంద్రబాబు నిర్ణయం దుర్మార్గం. రూ.లక్ష కోట్ల ఆస్తిని చంద్రబాబు తన అనుయాయులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. కలసికట్టుగా వ్యతిరేకిద్దాం.

కర్నూలు నగర మేయర్ బి.వై.రామయ్య..

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ప్రజల సంపూర్ణ మద్దతుతో వ్యతిరేకిద్దాం. జగనన్న చేపట్టిన మంచి కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం నీరుగారుస్తోంది. మహిళలకు చట్టసభల్లో 60 శాతం ప్రాధాన్యత కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. స్థానిక సంస్థల్లోనూ మహిళలకు వైఎస్సార్‌సీపీ అగ్రస్థానం కల్పిస్తుంది. త్వరలోనే జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వాన్ని మట్టికరిపిద్దాం.

కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి రెడ్డి, కోడుమూరు ఇన్‌చార్జి..

రెడ్‌బుక్ పాలనలో వైఎస్సార్‌సీపీ నేతలను, కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు భయపెట్టినా కార్యకర్తలు పార్టీనే నమ్ముకుని పోరాటం చేస్తున్నారు. అందుకే జగనన్న ఈ సారి కార్యకర్తలకు అగ్రస్థానం కల్పిస్తున్నారు. పార్టీలో కీలకమైన పదవులు కట్టబెడుతున్నారు. గత ప్రభుత్వంలో జగనన్నకు ఎంతో పేరు తీసుకొచ్చిన వైద్యం, విద్య, సచివాలయాల వ్యవస్థను ఈ ప్రభుత్వం నీరుగారుస్తోంది.

డాక్టర్ ఆదిమూలపు సతీష్, కోడుమూరు సమన్వయకర్త

ప్రజా వైద్యం ప్రజల హక్కు. ఆదోనిలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రజల ఆస్తి. ప్రయివేటు పరం చేస్తే సహించేది లేదు. ఉద్యమం ఉధృతం చేస్తాం. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరించరాదంటూ కోడుమూరు నియోజకవర్గంలో 60వేల మందితో సంతకాల సేకరణ చేపడుతున్నాం.

ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఏడాదిన్నరగా కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే కొండంత అండ. పార్టీకి కవచం వారే. అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యకర్తలకు అంత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దాం. పార్టీ పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ విజయవంతం చేద్దాం. ప్రజలను మభ్య పెట్టి ఓట్లు వేయించుకొని మోసం చేస్తున్న చంద్రబాబు విధానాలను తిప్పికొడదాం.

బుట్టా రేణుక, ఎమ్మిగనూరు ఇన్‌చార్జి

జగనన్న పేద ప్రజలకు, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగ పడే విధంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకొస్తే చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ చేయడాన్ని ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు కొనసాగితే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుంది. ఐదేళ్ల జగనన్న ప్రభుత్వంలో నిత్యం పేదల గురించి ఆలోచిస్తే చంద్రబాబు నాయుడు మాత్రం ఉన్న వాళ్లకు కట్టబెట్టేందుకు నిర్ణయించడం తగదు. ప్రజలతో కలిసి కూటమి కక్షను ఎండగడతాం.

పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి..

కార్యకర్తల బలంతో చంద్రబాబు మోసాలను ఎండగడదాం. జగనన్న మంచి ఉద్దేశంతో చేసిన ప్రతి కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రజలకు మంచి చేయాలని జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తే చంద్రబాబు నాయుడు ఆ పథకాలను కాపీ కొట్టి సూపర్ సిక్స్ పథకాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రజా వైద్యం ప్రజలకే చెందాలన్న ఉద్దేశంతో జగనన్న చేపట్టిన కోటి సంతకాల సేకరణ ముమ్మరంగా చేపడతాం.

ప్రధాని సభకు విస్తృత ఏర్పాట్లు

- మూడు లక్షల మందికి సరిపడే విధంగా సదుపాయాల కల్పన
- పది వేల బస్సులకు పార్కింగ్ సౌకర్యం
- కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి వెల్లడి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం ప్రధాని పర్యటనకు సబంధించి సభ నిర్వహణ, హెలిప్యాడ్, పార్కింగ్ ఇతర ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, అన్నమయ్య జిల్లా జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, కుడా చైర్మన్ సోమిశెట్టి, సీఎం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందుగా ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు చేరుకొని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా శ్రీశైలం వెళ్తారన్నారు. శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబదేవి దర్శనం అనంతరం నన్నూరు టోల్ ప్లాజా వద్ద రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ఈ బహిరంగ సభను 40 ఎకరాల్లో మూడు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 347 ఎకరాల్లో 10 వేల బస్సులు నిలుపుకునేలా 12 పార్కింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి జాతీయ రహదారికి అనుసంధానం చేసినట్లు చెప్పారు. సభకు వచ్చే వారికి 15 లక్షల లీటర్ల తాగునీరు, మజ్జిగ, భోజనం, అవసరమైన వైద్య సదుపాయాలు, టాయిలెట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, నోడల్ ఆఫీసర్

పీఎం సభా ఏర్పాట్లను మంత్రి టీజీ భరత్, పీఎం ప్రోగ్రాం నోడల్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాట్ల గురించి కలెక్టర్ వారికి వివరించారు. సభకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని వారు కలెక్టర్‌ను ఆదేశించారు.

పంట నష్టం ఎన్యుమరేషన్‌కు ఆదేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై సమగ్ర అంచనాకు ప్రభుత్వం ఎన్యుమరేషన్ నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో అధిక వర్షాలు కురిశాయి. చిప్పగిరి, ఆదోని, కౌతాళం, తుగ్గలి, మద్దికెర, కర్నూలు, కల్లూరు, ఆస్పరి, కోసిగి, మంత్రాలయం, దేవనకొండ మండలాల్లో 119 గ్రామాలపై అధిక వర్షాల ప్రభావం ఉంది. ఈ గ్రామాల్లో 16,898 మంది రైతులు 13,854 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా తేల్చారు. అధిక వర్షాల వల్ల జరిగిన పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి అంచనా వేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈనెల 16వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెల చివరి నాటికి వివరాలను ప్రభుత్వానికి పంపనున్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు

కర్నూలు(సెంట్రల్): సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు చర్యలు చేపట్టాలని జేసీ డాక్టర్ బి.నవ్య వ్యవసాయాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పత్తి కొనుగోళ్లపై వ్యవసాయాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025–26వ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రైతుల నుంచి సీసీఐ ద్వారా పత్తికొనుగోలుకు నిర్ణయించిందన్నారు. నోటిఫై చేసిన జిన్నింగ్ మిల్లుల్లో క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,060 ప్రకారం నాణ్యతను బట్టి చెల్లిస్తామన్నారు. అమ్మదలచిన రైతు ఆధార్ కార్డు జిరాక్స్, పట్టాదారుపాసుపుస్తకం జిరాక్స్, రైతు బ్యాంకు పాసు బుక్కు, రేషన్ కార్డు ప్రతిని తీసుకురావాలన్నారు. రైతులు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవడంతో పాటు.. కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ఎస్‌జీటీ కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు నిర్వహించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. వీరందరికీ స్కూల్స్ కేటాయించేందుకు ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా, స్కూల్ అసిస్టెంట్లకు వెబ్ కౌన్సెలింగ్ చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారుగా 4,168 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే చాలా ఏళ్లుగా 3, 4 కేటగిరీల్లోని స్కూళ్లలో టీచర్ పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీకి నోచుకోవడం లేదు. దీంతో ప్రస్తుత డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్న 2,590 టీచర్ పోస్టులను పశ్చిమ ప్రాంతంలోనే ఎక్కువగా భర్తీ కానున్నాయి. స్కూల్ అసిస్టెంట్ల వెబ్ కౌన్సిలింగ్ దాదాపు పూర్తయింది. ఎస్‌జీటీలకు నేటి(శనివారం) మధ్యాహ్నం వరకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్ పూర్తయిన అభ్యర్థులకు శనివారం రాత్రి కానీ, ఆదివారం నాటికి ఆర్డర్లు జారీ కానున్నాయి.

నాణ్యత 'తెల్ల'బోయి!



బైన్‌దొడ్డిలో వర్షాలకు చెట్ల మీదే తడిసిపోయిన పత్తి

కోడుమూరు రూరల్: ఈ ఏడాది పత్తి పంట సాగు చేసినప్పటి నుంచి రైతులకు వరుణదేవుడు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాడు. ఇప్పటికే అధిక వర్షాలకు నియోజకవర్గంలో పత్తి పంట భారీగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో గత వారం రోజుల వరుణదేవుడు కొంత తెరిపి ఇచ్చాడు. దీంతో రైతులు ఉన్న కాస్తా పత్తి దిగుబడులను తీసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెలవారుజామున వరకు కురిసిన వర్షాలకు చెట్ల మీద ఉన్న పత్తి అంతా తడిసిపోయింది. దీంతో చేతికొచ్చిన పత్తి తెంపకుండానే చెట్లపై తడిసి మద్దవ్వడంతో పత్తి నాణ్యత దెబ్బతింటుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అలాగే ప్రస్తుతం కురుస్తున్న వ ర్షాలకు సజ్జ పంట కూడా దెబ్బతినే ప్రమాదం నెలకొందని రైతులు వాపోతున్నారు

క్లుప్తంగా

మనేకుర్తిలో చోరీ



బీరువా ధ్వంసం చేసిన దృశ్యం

ఆలూరు రూరల్: మనేకుర్తి గ్రామంలోని ఓ ఇంట్లో అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఇంటి తలుపులు, బీరువా ధ్వంసం చేసి బంగారు ఆభరణాలు ఎత్తికెళ్లిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పెద్ద లింగయ్య వైఎస్సార్ కడప జిల్లా కేంద్రంలో సెంట్రింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఇంటి వద్ద భార్య లక్ష్మి, కూతురు నివాసం ఉంటున్నారు. గురువారం గ్రామంలో బంధువు మరణించడంతో కూతురుతో కలిసి ఇంటికి తాళాలు వేసి అక్కడికి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూస్తే ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలు బీరువా తలుపులు పెకిలించి అందులో ఉన్న 6 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఆలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



నరేంద్ర కుమార్ రెడ్డి (ఫైల్)

బేతంచెర్ల: గోర్లగుట్ట గ్రామంలో నాపరాళ్ల ట్రాక్టర్, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన ముక్కెర నారాయణరెడ్డి కుమారుడు నరేంద్ర కుమార్ రెడ్డి (30), చాకలి సుబ్బయ్య కలసి బైక్‌పై పలుకూరు క్రాస్ రోడ్డు వద్దకు బయలుదేరారు. అదే సమయంలో బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామం నుంచి నాపరాళ్ల లోడుతో బేతంచెర్ల వైపు వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నరేంద్ర కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, చాకలి సుబ్బయ్యతో పాటు అదే సమయంలో అక్కడ రోడ్డు దాటుతున్న బాలిక రజని గాయాలతో బయట పడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆదాయం వద్దు.. ప్రయివేట్ ముద్దు

శ్రీశైల దేవస్థానం ఎకరం భూమిలో హరిత రిసార్ట్ ఏర్పాటు

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.14.75 కోట్లతో అభివృద్ధి
- 98 శాతం ఆక్యుపెన్సీతో నెలకు రూ.57 లక్షల ఆదాయం
- అయినా ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రభుత్వం అడుగులు



శ్రీశైలం హరిత రిసార్ట్ ముఖ ద్వారం

శ్రీశైలం టెంపుల్: పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) యూనిట్లను కూటమి ప్రభుత్వం ప్రయివేట్‌కు అప్పగించేందుకు అడుగులు వేస్తోంది. ప్రసిద్ధ శ్రీశైలం దేవస్థానం పరిధిలో ఉన్న ఏపీ టూరిజంకు చెందిన హరిత రిసార్ట్‌ను ఇలానే వ్యక్తులకు కట్టబెట్టనుంది. 2002లో దాదాపు రూ.కోటితో 32 రూములతో ఈ రిసార్ట్ ప్రారంభమైంది. అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ చూపి మరింత మెరుగుపరిచింది. ప్రస్తుతం 124 రూములతో భక్తులకు సేవలందిస్తోంది. 98 శాతం ఆక్యుపెన్సీతో టూరిజం శాఖకు నెలకు రూ.57 లక్షల ఆదాయం ఒక్క హరిత రిసార్ట్ నుంచే వస్తోంది. అయినా, ప్రైవేట్‌కు ఇచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో టూరిజం ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు.

- శ్రీశైల దేవస్థానానికి చెందిన ఎకరం భూమిలో ఏపీ టూరిజం శాఖ ఆధ్వర్యంలో హరిత రిసార్ట్ ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశం, లక్ష్యంతో నామమాత్ర రుసుము, భూమి అద్దెతో ఈ భూమిని 23 ఏళ్ల క్రితం టూరిజం శాఖకు కేటాయించారు. 2002లో రూ.కోటితో 32 వసతి గదులు, హోటల్ నిర్మించారు. సామాన్య భక్తులకు సైతం వసతి గదులు అందుబాటులో ఉండేలా హరిత రిసార్ట్ ఏర్పాటు చేశారు. ఆదరణ బాగుండడంతో 2009లో మరో 44 గదులను నిర్మించారు.
- హరిత రిసార్ట్‌ను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులకు మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్ సంకల్పించారు. అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రూ.14.97 కోట్లతో టెండర్లను పిలిచి 2024 మార్చిలో పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేశారు. ప్రస్తుతం శ్రీశైలం హరిత రిసార్ట్‌లో పాత, కొత్త భవనాల్లో 124 వసతి గదులు ఉన్నాయి.

ప్రైవేట్‌కు అప్పగిస్తే క్షేత్ర పవిత్రతకు ముప్పు!

శ్రీశైల మహాక్షేత్రంలో ఉన్న హరిత రిసార్ట్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెడితే పవిత్రతకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. ధరలు అందుబాటులో ఉండకపోగా, వసతి గదుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదం లేకపోలేదు. ప్రస్తుతం హరిత రిసార్ట్ స్థలం దేవస్థానానికి చెందినది. ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించాలనే ఉద్దేశంలోనే ఉంటే.. హరిత రిసార్ట్‌ను దేవస్థానమే నిర్వహించేలా చూడాలని భక్తులు కొరుతున్నారు.

- వీటిలో 12 నాన్ ఏసీ గదులు (రోజుకు రూ.1,232), 44 ఏసీ గదులు (రోజుకు రూ.1,904), 24 డీలక్స్ గదులు (రోజుకు రూ.2,128), ఇవికాక 8 ఎగ్జిక్యూటివ్ గదులు (రోజుకు రూ.2,688) ఉన్నాయి. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో నిర్మించిన 36 గదులు, కొత్త హంగులతో నిర్మించిన రెస్టారెంట్ ఇంకా ప్రారంభించాల్సి ఉంది.
- శ్రీశైలం హరిత రెస్టారెంట్ పర్యటకుల మన్ననలు పొందుతోంది. 2022లో నెలకు రూ.32 లక్షలున్న ఆదాయం అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టడంతో మరింత పెరిగింది. కేవలం ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న హరిత రిసార్ట్ 98 శాతం ఆక్యుపెన్సీ సాధించింది. రిసార్ట్ నుంచి నెలకు రూ.57 లక్షల ఆదాయం టూరిజం శాఖకు లభిస్తోంది.
- రిసార్ట్‌లో 23 ఏళ్ల నుంచి వివిధ కేటగిరీల్లో 45 మంది విధులు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 26, ఔట్‌సోర్సింగ్‌లో 9, సెక్యూరిటీలో ముగ్గురు పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేస్తానని ప్రకటించడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.



శ్రీశైలం హరిత రిసార్ట్‌లో నూతనంగా నిర్మించిన గదులు, రెస్టారెంట్



ఆహ్లాదకర వాతావరణంలో హరిత రిసార్ట్

ఇసుక మాఫియా డాన్ హొళగుంద ఎస్‌ఐ



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన ఎమ్మెల్యే బి.విరుపాక్షి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

స్వయంగా రెండు టిప్పర్ల ద్వారా ఇసుక దందా

- వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తే డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తాం
- ఎస్‌ఐపై చర్యలు తీసుకోకపోతే పోలీసు స్టేషన్‌ను ముట్టడిస్తాం
- హెచ్చరించిన వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి

కర్నూలు(సెంట్రల్): హొళగుంద ఎస్‌ఐగా పనిచేస్తున్న దిలిప్‌కుమార్ ఇసుక మాఫియా డాన్‌గా వ్యవహరిస్తున్నారని ఆలూరు నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే బి.విరుపాక్షి సంచలన ఆరోపణలు చేశారు. స్వయంగా ఆయనే రెండు టిప్పర్లను ఏర్పాటు చేసుకొని దందా చేస్తున్నారని, ఇతరులు ఎవరైనా టిప్పర్లతో ఇసుక రవాణా చేస్తే అందులో ఒక్క ట్రిప్పును ఎస్‌ఐ పేరిట వేసి డబ్బు వసూలు చేసిచ్చేలా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం ఎమ్మెల్యే బి.విరుపాక్షి కలెక్టర్‌ను కలిసేందుకు కర్నూలు వచ్చారు. అయితే కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో మీడియాతో మాట్లాడుతూ హొళగుంద ఎస్‌ఐ దిలిప్ కుమార్ ఖాకి డ్రెస్సు ముసుగులో టీడీపీ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని ఆరోపించారు. వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తున్నారని, బలవంతంగా వైఎస్‌ఆర్‌సీపీ నాయకులను టీడీపీలో చేరుస్తున్నట్లు చెప్పారు. ఇటీవల హొళగుందలో వాటర్ ఫిల్టర్ కోసం రూ.19 లక్షల జెడ్పీ నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే పనులను చేసుకోవాలంటే వైఎస్‌ఆర్‌సీపీ జెడ్పీటీసీ, ఎంపీపీ, ఇతర నాయకలను టీడీపీలో చేరాలని బలవంతం చేస్తున్నారన్నారు. మరోవైపు ఎస్‌ఐ దిలిప్‌కుమార్‌పై చర్యలు తీసుకోకపోతే హొళగుంద పోలీసు స్టేషన్‌ను ముట్టడిస్తామని, ఆయన పేరును వైఎస్‌ఆర్‌సీపీ డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామని హెచ్చరించారు.

శ్రీనివాసరెడ్డికి వైఎస్ జగన్ పరామర్శ

తుగ్గలి: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, దివంగత మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి చిన్న కుమారుడు తుగ్గలి శ్రీనివాసరెడ్డి కంటి సమస్యతో బాధపడుతూ బెంగళూరులో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆయనను ఫోన్‌లో పరామర్శించారు. కంటి చికిత్సపై ఆరా తీసి, ఆరోగ్యం బాగా చూసుకోవాలని సూచించినట్లు శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రీశైల దేవస్థాన నూతన ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి ధర్మకర్తల సలహా మండలిని నియమిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 17 మందితో కూడిన ధర్మకర్తల సలహా మండలిని నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దేవదాయ ధర్మదాయ చట్టాన్ని అనుసరించి రెండేళ్ల కాలపరిమితితో ఈ నూతన ధర్మకర్తల సలహా మండలి ఉంటుంది. సభ్యులుగా పోతుగంటి రమేష్ నాయుడు, ఏ.వి.రమణ, బి.రవణమ్మ, చిట్టిట్ల భరద్వాజ శర్మ, జి.లక్ష్మీశ్వరి, గుల్లా గంగమ్మ, కె.వర్ధిని, ఎస్.పిచ్చయ్య, జె.రేఖాగౌడ్, ఏ.అనిల్‌కుమార్, దేవకి వెంకటేశ్వర్లు, బి.వెంకటసుబ్బారావు, సి.కాశీనాథ్, ఎం.మురళీధర్, యు .సుబ్బలక్ష్మీ, పి.యు. శివమ్మ, జి.శ్రీదేవిలను శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల సలహా మండలి సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవస్థాన సీనియర్ అర్చకులను ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమిస్తారు. ట్రస్ట్‌బోర్డు సభ్యులు ప్రమాణ స్వీకారం అనంతరం సమావేశమై చైర్మన్‌ని ఎన్నుకుంటారు.

రోడ్డు ప్రమాదంలో లస్కర్ మృతి



తిరుపాల్ (ఫైల్)

కౌతాళం/ఆదోని రూరల్: తుంగభద్ర దిగువ కాల్వ పరిధిలో కౌతాళం సెక్షన్‌లో లస్కర్‌గా పని చేసే తిరుపాల్ (46) శుక్రవారం సాయంత్రం ఆదోని మండలం ఆరేకల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. భార్య సుమలత, కుమారుడు విక్రమ్‌తేజాతో కలిసి ఆరెకల్లు పరిసరాల్లోని పార్క్‌కు పోయి తిరిగి వస్తుండగా లారీ వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీ కొట్టింది. దీంతో తిరుపాల్ అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు తేజ, భార్య సుమలతకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తిరుపాల్ మృతి పట్ల ఈఈ పాండురంగయ్య, డీఈ షఫీవుల్లా, ఏఈ ఈశ్వర్‌లు సంతాపాన్ని తెలిపారు.

చైల్డ్ వెల్ఫేర్ చెంతకు బాలుడు



బాలుడిని చేరదీసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

ఎమ్మిగనూరురూరల్: అమ్మ, నాన్నను కోల్పోయి అనాథగా మిగిలిన బాలుడు చైల్డ్ వెల్ఫేర్ చెంతకు చేరాడు. సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. దేవందిన్నె గ్రామానికి చెందిన నాగరాజు, ఎల్లమ్మల కుమారుడు ప్రసన్నరాజు 9వ తరగతి వరకు చదువుతూ మధ్యలో మానేసి కూలీ పనులకు వెళ్లేవాడు. తండ్రి నాగరాజు చనిపోవడం, పక్షవాతంతో మంచం పట్టిన తల్లి ఎల్లమ్మకు అన్ని తానై కుమారుడు ప్రసన్నరాజు సేవలు అందిస్తున్న వైనాన్ని గత నెల 23వ తేదీన సాక్షిలో 'అమ్మకు కుమారుడు లాలి' కథనం ప్రచురితమైంది. ఈ కథనం ప్రచురితమైన రోజుల వ్యవధిలో బాలుడి తల్లి ఎల్లమ్మ కూడా మృతి చెందటంతో బాలుడు ప్రసన్నరాజు అనాథగా మిగిలాడు. అప్పటికే 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఐసీడీఎస్ పీడీ విజయ స్పందిస్తూ బాలుడి పరిస్థితిపై విచారణ చేయాలని ఎమ్మిగనూరు ఐసీడీఎస్ సీడీపీఓ సఫర్‌న్నిసాబేగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఆమె గ్రామానికి వెళ్లి బాలుడి పరిస్థితిని ఆరా తీయగా ఇటీవల తల్లి కూడా మరణించినట్లు తెలుసుకున్నారు. బాలుడితో మాట్లాడి చదువుపై ఆసక్తి ఉన్న విషయాన్ని ఆమె పీడీకి వివరించారు. దీంతో కర్నూలులో చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీకి అప్పగించాలని పీడీ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వయోల ప్రీతి బాలుడిని తీసుకొని కర్నూలులోని చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీకి అప్పగించారు. దసరా సెలవులు రావటం, చనిపోయిన బాలుడు తల్లి అంత్యక్రియల కార్యక్రమాలు ఉండటంతో బాలుడి అప్పగింత కొంత ఆలస్యమైందని తెలిపారు.

భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(హాస్పిటల్): ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోగలిగితే మానసికంగా దృఢంగా ఉంటారని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయసేవాసదన్ సివిల్ జడ్జి బి. లీలా వెంకటశేషాద్రి అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కర్నూలు మెడికల్ కాలేజీలోని సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక, సామాజిక ఆరోగ్యం బాగున్నప్పుడే వారిని ఆరోగ్యవంతులు అంటారన్నారు. వ్యక్తులు తీవ్ర ఒత్తిడికి గురైనప్పుడు స్నేహితులు, దగ్గరి బంధువులు వారిని గుర్తించి కలుపుకుని వెళ్తే ఆ సమస్యలోంచి బయటపడతారన్నారు. పౌరులకు ఎవ్వరికైనా ఇబ్బందులు ఎదురైనప్పుడు లీగల్ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100ను సంప్రదించాలన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. 'విపత్తులు, ఆపత్కాల పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యసేవలో అందుబాటులో' అన్నది ఈ ఏడాది థీమ్‌గా నిర్ణయించారన్నారు. ఎవ్వరికైనా మానసికంగా ఆపత్కర పరిస్థితి ఏర్పడితే సేవల కోసం టెలీ మానస్ టోల్ ఫ్రీ నెంబర్ 14416 నంబర్‌ను సంప్రదించాలన్నారు.అనంతరం మెడికల్, నర్సింగ్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.చివరగా నర్సింగ్ కాలేజీజీ విద్యార్థులు 'ఒత్తిడి సమయాల్లో ఎలా వ్యవహరించాలి' అనే నాటిక ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎండోక్రైనాలజి హెచ్‌ఓడీ డాక్టర్ పి.శ్రీనివాసులు, డీఎల్‌ఎస్‌ఏ సభ్యులు రాయపాటి శ్రీనివాస్, సైకియాట్రి విభాగ వైద్యులు గంగాధరనాయక్, యతిరాజు, ఎస్‌ఆర్‌లు ఉమైద్ సిరాజ్, జయశ్రీ, పీజీలు పాల్గొన్నారు.

మానసిక వ్యాధుల విభాగం సందర్శన..

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక వ్యాధుల విభాగాన్ని సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న మానసిక రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం అక్కడి రోగులను చూసుకునే తల్లిదండ్రులు, ఇతర పరిచారికులకు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల ఆరోగ్య సంరక్షణ హక్కు, ఆస్తి హక్కు మొదలైన వాటితో సహా మానసిక రోగుల హక్కులు, వారి రక్షణ, వైద్యచికిత్సల గురించి వివరించారు. సమాజంలో అందరిలాగే వీరికీ జీవించే హక్కు ఉందని తెలిపారు.

కేసీలో గుర్తు తెలియని వ్యక్తి శవం

జూపాడుబంగ్లా:కర్నూలు-కడప(కేసీ)కాల్వలో శుక్రవారం ఉదయం 8.20 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకుపోయింది. శరీరం బాగా ఉబ్బిపోయి దుర్వాసన వెదజల్లుతున్న వ్యక్తి మృతదేహం నీళ్లపై తేలియాడుతూ కేసీ కాల్వలో కొట్టుకపోతుండటాన్ని పొలాలకు వెళ్తున్న కూలీలు, రైతులు చూసి భయాందోళనకు గురయ్యారు. మృతదేహంపై ఉన్న దుస్తువులు చిరిగిపోయి ఉండగా కాళ్లవద్ద కేవలం నల్లనిప్యాంటు మాత్రమే కనిపించింది. కేసీ కాల్వలో నీటి ప్రవాహం మొదలైందంటే చాలు కేసీ కాల్వలో మృతదేహాలు కొట్టుకపోవటం పరిపాటిగా కొనసాగుతుంది

అనుమతి లేని టపాసులు పట్టివేత



టపాసులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

నంద్యాల: నంద్యాల పట్టణంలో అనుమతి లేకుండా టపాసుల వ్యాపారం చేస్తున్న వారి ఇళ్లు, షాపులపై శుక్రవారం దాడులు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో పట్టణంలోని చిత్తలూరి వీధికి చెందిన కృష్ణమోహన్ అనే వ్యక్తి ఇంట్లో అనుమతులు లేకుండా రూ.30వేలు విలువ చేసే టపాసులు నిల్వ ఉంచుకున్నారని, వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ టపాసులను భద్రతా దృష్ట్యా గోడౌన్‌కు పంపామన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈ దాడులు చేస్తున్నామని, అనుమతి లేకుండా టపాసుల వ్యాపారం చేసినా, నిల్వ ఉంచుకున్నా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చీటీల పేరుతో రూ.2 కోట్లకు టోపీ!

డోన్ టౌన్: చీటీల పేరుతో రూ.2 కోట్ల మేర వసూలు చేసిన వ్యక్తి అదృశ్యమవ్వడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటన నంద్యాల జిల్లా డోన్‌లో జరిగింది. వివరాలు.. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసం ఉంటున్న వాయిగండ్ల వెంకటేశ్వర్లు చీటీల వ్యాపారం చేస్తుండేవాడు. అందరి వద్ద డబ్బు వసూలు చేయడంతో పాటు బయటి వ్యక్తుల వద్ద కూడా ఫైనాన్స్ డబ్బులు తీసుకున్నాడు. కొన్ని రోజులుగా అతను కనిపించకపోవడంతో.. డబ్బు లిచ్చిన వారంతా ఆందోళనకు గురయ్యారు. కర్నూలులో ఉంటున్న అతని సోదరులకు ఫోన్లు చేసినా ఉపయోగం లేకపోవడంతో.. బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. వెంకటేశ్వర్లు ఐపీ పెట్టాలనే ఉద్దేశంతో ఇల్లును సైతం కొద్ది రోజుల క్రితం ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై బాధితులు శుక్రవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు



గాయపడిన ఉపాధ్యాయుడు బసవరాజు

గోనెగండ్ల: తన కుమారుడిని మందలించాడని ఉపాధ్యాయుడిపై విద్యార్థి తండ్రి దాడి చేసిన సంఘటన గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధిత ఉపాధ్యాయుడు బసవ రాజు, విద్యాశాఖ అధికారులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు.. కర్నూలుకు చెందిన బసవ రాజు గత ఎనిమిదేళ్లుగా గాజులదిన్నె గ్రామంలో ప్రాథమిక పాఠశాల(ఎస్సీ కాలనీ)లో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. అదే కాలనీకి చెందిన మీసాల రంగస్వామి కుమారుడు హర్షవర్ధన్ మానసిక దివ్యాంగుడు. ఆ పాఠశాలలో నాల్గవ తరగతి చదువుతున్నాడు. కాగా మూడు, నాలుగు రోజులుగా హర్షవర్ధన్ పాఠశాలకు రాకపోవడంతో గురువారం ఉపాధ్యాయుడు బసవరాజు కొంత మంది విద్యార్థులను బాలుడి ఇంటికి పంపాడు. అయితే తన కుమారుడిని ఉపాధ్యాయుడు భయపెట్టాడని, అందుకే పాఠశాలకు రావడం లేదని తండ్రి మీసాల రంగస్వామి విద్యార్థులకు చెప్పి పంపాడు. ఇంటి వద్దకు విద్యార్థులను ఎలా పంపుతావంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం బైక్‌పై పాఠశాలకు వస్తున్న ఉపాధ్యాయుడు బసవరాజుపై ఈత కర్రతో దాడి చేశాడు. అక్కడే ఉన్న కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఉపాధ్యాయుడికి ముక్కుకు, తలకు, చేతికి రక్త గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఉపాధ్యాయుడు బసవ రాజు, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు మీసాల రంగస్వామిపై దాడి కేసు నమోదు చేశారు.



ఉపాధ్యాయ సంఘాలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయుడు

చివరి రోజు దాడి..

ఒకే చోట ఎనిమిదేళ్లు పనిచేస్తున్న బసవరాజును గాజులదిన్నె నుంచి కోడుమూరుకు బదిలీ చేశారు. గాజులదిన్నె పాఠశాలలో శుక్రవారం చివరి రోజు విధులు నిర్వహించి సోమవారం కోడుమూరు పాఠశాలలో జాయిన్ కావాల్సి ఉంది. కాగా చివరి రోజు విధులు నిర్వహించాలని వచ్చిన ఉపాధ్యాయుడికి ఇలాంటి సంఘటన జరగడం విచారకరం అని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకులాల్లో వసతులు మెరుగుపరచాలి

జూపాడుబంగ్లా: సాంఘిక సంక్షేమశాఖ అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో వసతులు మరింత మెరుగుపరచాలని ఆశాఖ సెక్రటరీ ప్రసన్నవెంకటేశ్ అన్నారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఎదుట నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంటును చూసి మరమ్మతులు చేయించి విద్యార్థులకు ఉపయోగపడేలా చేయాలని ఆదేశించారు. తరగతిగదిలోనే విద్యార్థుల పెట్టెలు, బట్టలు ఉండటాన్ని చూసి డార్మెట్రీ లేదా అని డీసీఓ శ్రీదేవి, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తిని ప్రశ్నించారు. ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేకంగా డార్మెట్రీ లేదని, తరగతి గదులనే డార్మెట్రీగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. డైనింగ్ హాల్‌ను పరిశీలించి డార్మెట్రీ వెనుకభాగం అపరిశుభ్రంగా ఉండటంతో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు తెచ్చిన అరటిపండ్లను పరిశీలించి నాసిరకమైనవి ఎందుకు తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండిపెట్టాలని, ఏదైనా పొరపాట్లు జరిగితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.



అరటిపండ్లను పరిశీలిస్తున్న సెక్రటరీ ప్రసన్న వెంకటేశ్, చిత్రంలో డీసీఓ శ్రీదేవి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ

పరుగు పోటీలో ట్రాన్స్‌జెండర్ ఘనత

- రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యూత్ ఫెస్ట్ మారథాన్-5 కి.మీ పరుగు పోటీలో కర్నూలు జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ లీలా ప్రసాద్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెంటర్లు కలిపి 130 మంది పాల్గొనగా లీలా ప్రసాద్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ నీలకంఠారెడ్డి, అదనపు పీడీ డాక్టర్ సుచిత్ర, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల చేతుల మీదుగా రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు లీలా ప్రసాద్ అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో కర్నూలు జిల్లాకు ద్వితీయ స్థానం రావడం పట్ల లీలా ప్రసాద్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, జిల్లా ఏయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, ఏపీ సాక్స్ క్లస్టర్స్ ప్రోగ్రామ్ మేనేజర్ అలీ హైదర్ అభినందించారు.



రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి బహుమతి అందుకుంటున్న ట్రాన్స్‌జెండర్ లీలాప్రసాద్